# గుట్టమీద గ్రామాలకు తాగునీరందిస్తా..



మోతెలో వేముల ప్రసంగాన్ని వింటున్న గ్రామస్తులు

- కోట్లాది రూపాయలతో గిరిజన తండాల అభివృద్ధి చేశా..
- పోడు భూములకు పట్టాలు అందజేశాం..
- మిషన్ భగీరథ ద్వారా తాగునీటి ఇబ్బందులను దూరం చేశా..
- బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- భీమ్‌గల్, వేల్పూర్ మండలాల్లో ఎన్నికల ప్రచారం

భీమ్‌గల్, నవంబర్ 25 : భీమ్‌గల్ మండలంలోని దేవక్కపేట్, మానాల తదితర గుట్ట మీద ఉన్న గ్రామాలకు తాగునీటిని అందించేందుకు కృషి చేస్తానని బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం భీమ్‌గల్, వేల్పూర్ మండలాల్లో పర్యటించారు. ఉదయం భీమ్‌గల్ మండలంలోని దేవక్కపేట్, తాళ్లపల్లి, గంగరాయి, కొత్తతండా, సాయంత్రం వేల్పూర్‌తో పాటు మోతెలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. భీమ్‌గల్ మండలంలోని దేవక్కపేట్, కారేపల్లి తదితర గ్రామాల్లో పోడు భూములకు పట్టాలిప్పించి భూమి హక్కులు కల్పించినట్లు తెలిపారు. 780 పోడు, 580 ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలు ఇప్పించినట్లు చెప్పారు. ఈ భూములకు గతంలో రైతుబంధు ఇతర ప్రయోజనాలు అందక రైతులు బాధపడేవారన్నారు. ఇప్పుడు ఆ సమస్య లేకుండా చేశానన్నారు. ఈ గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధిపనులు చేపట్టినట్లు వివరించారు. కాలు తీసి బయట పెడితే బురద ఉండే రోడ్ల స్థానంలో కాలికి బురద అంటకుండా తండాల్లో రోడ్లు, బీటీ రోడ్లు వేయించినట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి ఇబ్బందులు దూరం చేశానన్నారు. గతంలో వాగులకు చెలిమల వద్దకు నీటి కోసం వెళ్లాల్సిన దుస్థితిలో తండాలుండేవని గుర్తు చేశారు. దేవక్కపేట్, మానాల తదితర గుట్టల మీద ఉన్న గ్రామాలకు తాగునీటిని అందించేందుకు కృషిచేస్తానని, మళ్లీ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఇంజినీర్లు, ఆఫీసర్లు, గ్రామస్తులతో కలిసి పరిశీలిస్తామన్నారు. ఇదే విషయాన్ని సీఎం కేసీఆర్‌కు వివరించి సాధ్యమయ్యేలా చూస్తానన్నారు. అసైన్డ్ పట్టాలు కాంగ్రెస్ హయాంలో సాధ్యం కాలేదని, గ్రామస్తుల బాధలు చూసి సాధ్యం చేశానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి ఘనస్వాగతం లభించింది.

**వేములకు మున్నూరుకాపు సంఘం మద్దతు**

భీమ్‌గల్ మండలంలోని దేవక్కపేట్ గ్రామ మున్నూరుకాపు సంఘం సభ్యులు ఎన్నికల్లో వేములకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు శుక్రవారం దేవక్కపేట్‌కు వచ్చిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి తీర్మాన కాపీని సంఘ సభ్యులు అందజేశారు.



భీమ్‌గల్ మండలం దేవక్కపేట్‌లో యువకులు గులాబీ రంగును ఒంటినిండా పూసుకుని ఒంటిపై తమ గ్రామానికి చెందిన లబ్ధి వివరాలను రాసుకుని డ్యాన్స్‌లు చేస్తూ మంత్రి వేములకు స్వాగతం పలికారు

## ఉద్యమ గడ్డ మోతెను ఉన్నతంగా నిలిపాం



వేల్పూర్‌లో మాట్లాడుతున్న మంత్రి వేముల

వేల్పూర్, నవంబర్ 25: ఉద్యమ వేగుచుక్క మోతెపై సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకమైన ప్రేమ ఉందని, దీంతో గ్రామాన్ని అభివృద్ధిలో ఉన్నత స్థానంలో నిలిపామని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఆయన వేల్పూర్ తోపాటు మండలంలోని మోతె గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. 22 ఏండ్ల క్రితం తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ పార్టీకి, ఉద్యమానికి ఏకగ్రీవ తీర్మానం చేసి మద్దతు పలికిన తొలి గ్రామం మోతె అని గుర్తుచేశారు. ఇప్పటికీ గ్రామ ప్రజల్లో అదే మద్దతు, ఉత్సాహం, పౌరుషం కనిపిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో మోతె గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, ఏమాత్రం లోటైనా కేసీఆర్ ఊరుకోరని తెలిపారు. మోతె మట్టిని కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా చల్లి ఉద్యమస్ఫూర్తి రగిలించారన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా మోతెలో పీఏసీఎస్‌ను ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. రూ.కోటితో జీపీ భవనం నిర్మించినట్లు తెలిపారు. సాగు నీరు లేక అల్లాడిన గ్రామం చుట్టూ ఉన్న రెండు వాగుల్లో చెక్ డ్యాంలు నిర్మించి ద్వీపంలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. చెరువుకు మాటుకాలువ నిర్మించి శాశ్వతంగా నీటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి వేముల

వేల్పూర్, నవంబర్ 25 : కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల ముఖ్యనాయకులు, కార్యకర్తలు, యువకులు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. శనివారం ఎల్కటూర్‌కు చెందిన యువజన సభ్యులు, ఏర్గట్లకు చెందిన యువకులు, వేల్పూర్ మండల కేంద్రం ఆటో యూనియన్ సభ్యులు వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వేల్పూర్‌లోని మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బాల్కొండ మండలంలో నేడు వేములప్రచారం

బాల్కొండ, నవంబర్ 25: మంత్రి వేముల ఆదివారం బాల్కొండ మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు వన్నెల్(బీ), 10.30 గంటలకు బోదెపల్లి, 11.30 గంటలకు చిట్టాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.

## బీఆర్ఎస్‌తోనే వెనుకబడిన వర్గాలకు రక్షణ

**టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ**



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

వేల్పూర్, నవంబర్ 25 : బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రక్షణ ఉంటుందని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. శనివారం వేల్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మణిపూర్‌లో బీజేపీ ఆర్ఎస్ఎస్ గుండాలతో గిరిజనులపై ఊచకోతకు పాల్పడిన విషయాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీలు మరువకూడదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ గతంలో మత ఘర్షణలు లేపి అధికారం చేపట్టిందన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడేవారమని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా ఏర్పాటు చేసిన శుద్ధమైన జలాలను అందిస్తోందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలపై చిన్నచూపు చూశాయన్నారు. పదేండ్లుగా కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, రైతుబంధు, ఆసరా పెన్షన్ లాంటి అనేక పథకాలను ప్రతి వర్గానికి అందిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని సదుపాయాలతో గురుకులాలను ఏర్పాటు చేయడంతో ఏడాదికి లక్షల మంది విద్యార్థులు చదువుకుంటూ బయటికి వస్తున్నారని తెలిపారు. అభివృద్ధి జరగాలంటే అది విద్యతోనే అని, విద్యను అందించడంలో కేసీఆర్ ముందున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## వేముల సతీమణి ఇంటింటా ప్రచారం

వేల్పూర్, నవంబర్ 25: మండలంలోని మోతె గ్రామంలో శనివారం బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణి వేముల నీరజారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నియోజకవర్గంలో మంత్రి వేముల చేపట్టిన అభివృద్ధి పనులను వివరించి, మరోసారి వేములను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



మోతెలో ప్రచారం నిర్వహిస్తున్న వేముల నీరజారెడ్డి

మాక్ పోలింగ్‌లో పాల్గొన్న మహిళా టీచర్లు




## సరస్వతీ విద్యామందిర్‌లో ఓటు హక్కుపై అవగాహన

భీమ్‌గల్, నవంబర్ 25 : మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ విద్యామందిర్ పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఎన్నికల విధానం, ఓటు హక్కు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఓటింగ్ విధానం, కౌంటింగ్ ప్రక్రియతోపాటు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు కె.రవికుమార్ తెలిపారు. ఎన్నికల సిబ్బంది, ఓటర్లు, అభ్యర్థులుగా విద్యార్థులు వ్యవహరించారు.